# ముంపు ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

- దెబ్బతిన్న పంటల పరిశీలన
- న్యాయం చేయాలని కోరిన బాధితులు

పెనమలూరు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం బుధవారం విస్తృతంగా పర్యటించింది. కేంద్ర బృందం ప్రతినిధుల్లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి అనీల్ సుబ్రహ్మణ్యం నాయకత్వంలో ఎన్‌హెచ్‌ఐ చీఫ్ ఇంజినీర్ రాకేష్‌కుమార్, హైదరాబాద్ ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వీఎస్‌పీ శర్మ, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల్లో ముంపు ప్రాంతాలను పరిశీలించారు. పెదపులిపాక గ్రామం కరకట్ట దిగువున ఉన్న ఇళ్లు వరదల కారణంగా దెబ్బతినటంతో ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న మొక్క జొన్నపంటను, పంట పొలాల్లో మునిగిన ట్రాన్స్‌ఫార్మాలను, రక్షిత మంచినీటి పథకం ప్లాంట్‌ను చూశారు. ముంపునకు గురైన ఇళ్ల బాధిత కుటుంబాలతో మాట్లాడారు. తమ ఇళ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయని బాధితులు కేంద్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం చోడవరం గ్రామంలో ముంపునకు గురై దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన పంటల వివరాలు కేంద్ర బృందానికి చూపి వివరాలు తెలిపారు. చోడవరంలో వరి, కంద, చెరకు, బొప్పాయి, అరటి, పసుపు, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని రైతులు కేంద్ర బృందానికి తెలిపారు. కేంద్ర బృందం సభ్యులు రైతులతో మాట్లాడారు.


మద్దూరులో కేంద్ర బృందంతో చర్చిస్తున్న మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు


కేంద్ర బృందానికి సమస్యలు తెలుపుతున్న ముంపు బాధితులు

**నష్టం వివరాలు వెల్లడించిన రైతులు**

పంట సాగులో ఏఏ పంటకు ఎంత ఖర్చు చేసింది రైతులు కేంద్ర బృందానికి స్పష్టంగా వివరించారు. వరికి ఎకరాకు రూ.25 వేలు, అరటి ఎకరాకు లక్షన్నర, కందకు రూ.2.50 లక్షలు, చెరుకుకు రూ.70 వేలు, బొప్పాయికు రూ.2 లక్షలు, పసుపు పంటకు రూ.2 లక్షల చొప్పున ఖర్చు చేశామని రైతులు తెలిపారు. మండల పరిధిలో దాదాపు 750 ఎకరాల వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయన్నారు. గత ప్రభుత్వం హయాంలో పంటల బీమా అమలు చేసి రైతులకు వెంటనే నష్ట పరిహారం ఇచ్చారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలస్యం చేయకుండా వెంటనే రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పంటల బీమా కూడా వర్తింప చేయాలన్నారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్, ఆర్డీవో డి.రాజు, సర్పంచ్‌లు కాకర్ల వెంకటరత్నం, గుంటూరు శ్రీనివాసాచౌదరి, వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

**మద్దూరులో పర్యటన**

కంకిపాడు: వరద ముంపుతో ఏర్పడిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం బుధవారం కృష్ణాజిల్లాలోని గుడివాడ, పెడన, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. ఇందులో భాగంగా కేంద్ర హోం మంత్రిత్వ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని ప్రతినిధి బృందం కంకిపాడు మండలం మద్దూరులో రైతు ప్రతినిధులను కలుసుకుంది. వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు వరదతో ఏర్పడిన నష్టాన్ని, రైతుల కష్టాలను కేంద్ర బృందానికి వివరించారు. వరద ముంపును అధికమించేందుకు చేపట్టాల్సిన డైవర్షన్ చానల్ పనులకు సంబంధించిన మ్యాప్‌ను బృందానికి అందించి, చర్చించారు. ముంపు కారణంగా నష్టపోయిన రాష్ట్రాన్ని, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే అంశంపై దృష్టి సారించి అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ.. జాతీయ విపత్తుగా గుర్తించి రాష్ట్రానికి నిధులు కేటాయించాలని విన్నవించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కలెక్టర్ బాలాజీ, జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి, ఆర్డోఓ రాజు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి, తహసీల్దార్ భావన్నారాయణ, ఏఓ కిరణ్ పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఆపన్న హస్తం



రామవరప్పాడు: బుడమేరు ఉగ్రరూపంతో ముంపునకు గురై సర్వం కోల్పోయిన బాధితులకు విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే విద్యాసంస్థల ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ఆపన్న హస్తం అందిస్తున్నారు. నగరంలోని కండ్రిక, సింగ్‌నగర్, పాయకాపురం తదితర ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, పండ్లు, దుస్తులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, క్యాండిల్స్, శానిటరీ నాప్‌కిన్స్ అందించి బాధితులకు చేయూత అందిస్తున్నారు. కళాశాలలోని క్యాంటిన్‌లో ప్రత్యేకంగా వరద బాధితుల కోసం ఆహారం తయారు చేయించి ప్యాకెట్లను ముంపు ప్రాంతాల్లో అందజేశారు. ఇందు కోసం కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ముంపు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సేవ చేశారు. విపత్కర సమయంలో ముందుకొచ్చి వరద బాధితులకు సేవ చేయడం పట్ల విద్యార్థులను పలువురు అభినందిస్తున్నారు.

**నిత్యావసర కిట్లు పంపిణీ**



రామవరప్పాడు: బుడమేరు ముంపు బాధితులకు విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో బుధవారం సార్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులతో కూడిన కిట్‌లను బుధవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ రూరల్ మండలాధ్యక్షుడు శీలం రంగారావు చేతుల మీదుగా 25 మంది కుటుంబాలకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. బుడమేరుకు గండి పడి వరద నీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తిందన్నారు. గ్రామంలోని బాధితులకు అండగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బాసటగా నిలబడటం అభినందనీయమని చెప్పారు.

## క్లుప్తంగా

### సామాజిక సేవాభావం అలవర్చుకోవాలి



ఉయ్యూరు: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా భావాన్ని అలవర్చుకుని సమాజ అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని రత్న గ్రూప్స్ చైర్మన్ బోరుకాటి ప్రసాదరాజు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మండలంలోని కాటూరు జెడ్పీ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు, విద్యార్థినికి ట్రై సైకిల్ బుధవారం పంపిణీ చేశారు. ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజసాయి వెంకట్, హెచ్ఎం తలశిల రమాదేవి, తేజ ఫౌండేషన్ చైర్మన్ నేరెళ్ల వేణుగోపాల్, లయన్స్ ప్రతినిధులు దీనవాహి ప్రసాద్, నల్లా శ్రీనివాస్, ఎండీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

### వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌కు అటానమస్



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌కు అటానమస్ స్టేటస్ లభించిందని కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2024-25 విద్యా సంవత్సరం నుంచి అటానమస్ స్టేటస్ అమలు చేయుటకు అనుమతి వచ్చిందన్నారు. అటానమస్ స్టేటస్ వలన కళాశాలలో మరింత నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను, పెద్ద కంపెనీల్లో నియామకాలు ఎక్కువ జరగడానికి ఆ కంపెనీలకు కావలసిన సిలబస్‌ను కొంత వరకు యూనివర్సిటీ అనుమతితో బోధించుటకు అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు.

### నున్న - నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డులో గండ్లు



నున్న(విజయవాడరూరల్): నున్న - నూజివీడు ఆర్అండ్‌బీ రహదారిలో అధికారులు అనేక చోట్ల గండ్లు పెడుతున్నారు. ఆర్అండ్‌బీ, వీఎంసీ అధికారులు విజయవాడ నగర శివారులోని కండ్రిక, రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్ సహా పలు లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న బుడమేరు వరద నీటిని బయటకు పంపేందుకు పొక్లెయిన్‌తో బుధవారం గండ్లు పెట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే 14 గండ్లు పెట్టామని అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు బుడమేరు వరదలో ఉండటం వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వరద నీటిని ఖాళీ చేయించడానికి అధికారులు గండ్లు పెట్టి నీరు పొలాల్లోకి వదిలారు. దీని వలన నున్న-నూజివీడు రోడ్డులో రాకపోకలకు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి.

### పెనమలూరులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: పెనమలూరులో ఓ వ్యక్తిపై జరిగిన దాడి ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు గ్రామంలో నవ్యా మెడోస్ అపార్టుమెంట్‌లో కె.విజయ్ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అతను ఫార్మా కంపెనీలో పని చేస్తాడు. విజయ్ అపార్టుమెంట్‌కు సంబంధించి వ్యవహారాలు చూస్తాడు. అయితే అపార్టుమెంట్‌లో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేసి మంగళవారం అర్ధరాత్రి ఊరేగింపు నిర్వహించి, చోడవరంలో నిమజ్జనం చేశారు. ఇంటికి వచ్చిన విజయ్‌తో అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న సురేష్ అనే వ్యక్తి తనను నిమజ్జనానికి పిలువలేదని విజయ్‌తో తగాదా పెట్టుకుని దాడి చేశాడు. దాడిలో విజయ్ తలకు గాయమైంది.ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

## వరద బాధితులకు ప్రభుత్వం సాయం అందించాలి

పెనమలూరు: రాష్ట్రంలో వరదల కారణంగా పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందించాలని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి కోరారు. మండల పరిధిలో బుధవారం కేంద్ర బృందం పర్యటించిన సమయంలో కుమారస్వామి వినతిపత్రాన్ని కేంద్ర బృంద ప్రతినిధి అనీల్ సుబ్రమణ్యం, జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీకి అందజేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి వివరాలు తెలుపుతూ.. భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో రూ.6880 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ప్రాథమిక అంచనాల కన్నా నష్టం రెట్టింపు ఉందన్నారు. దాదాపు 5 లక్షల మంది రైతులు పంటలు నష్టపోయారని చెప్పారు. పంట నష్టం మదింపు చేసి రైతులకు పంట నష్టం ప్రకటించాలని, కాలువలు, డ్రెయిన్లు, పంట పొలాలకు వెళ్లే రహదారుల మరమ్మత్తులు చేయాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళిక రూపొందించి ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందజేయాలన్నారు. బ్యాంకు రుణాలు రీ షెడ్యూల్ చేయాలని, కౌలు రైతులను ఆదుకోవాలని, పంటల బీమా రైతులకు అమలు చేయలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు మోహన్, జిల్లా అధ్యక్షుడు గోపిశెట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పెదపులిపాకలో కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేస్తున్న కుమారస్వామి

**వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి**

పెనమలూరు: కృష్ణానది వరదతో కట్టుబట్టలతో మిగిలిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర బృందం ప్రతినిధులు పెదపులిపాకలో పర్యటించిన సమయంలో సీపీఎం పార్టీ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ కృష్ణానది వరదల వలన 10 అడుగుల ఎత్తుల వరద నీరు వచ్చిందన్నారు. దీని కారణంగా గృహాల్లో వరద నీరు ప్రవేశించి పూర్తి నష్టం కలిగించిందని తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి నివాసితులకు పరిహారం ప్రకటించి, అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు షేక్.మస్తాన్‌వలి, షేక్.కాశిం తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పెనమలూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వాతావరణ నిపుణుడు డాక్టర్ కె.ప్రవీణ్ అన్నారు. జేసీఐ డైమండ్ వారోత్సవాల్లో భాగంగా కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం వాతావరణంలో వచ్చే మార్పులు - మన బాధ్యత అనే అంశంపై 200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ వాతావరణ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ట్రిపుల్ ఈ హెడ్ పీవీఆర్ఎల్ నరసింహం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, జేసీఐ ప్రతినిధులు రవీంద్రరెడ్డి, రాజేంద్రరెడ్డి, ఏవీ రామకృష్ణ పాల్గొన్నారు.

## సమీకృత దాణా పంపిణీ



ఉంగుటూరు: బుడమేరు వరద వలన ముంపునకు గురైన గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సమీకృత దాణాను బుధవారం పంపిణీ చేశారు. పశుపోషకులను ఆదుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం తక్షణ సహాయం కింద దాణాను పంపిణీ చేస్తున్నట్లు పశు వైద్యాధికారులు తెలిపారు. ముంపు గ్రామాలైన లంకపల్లి, ముక్కపాడు, ఓంద్రంపాడు, ఇందుపల్లి, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ఎలుకపాడు గ్రామాల్లో సమీకృత పశుదాణాను పశు పోషకులకు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్య అధికారులు డాక్టర్ రాధాకృష్ణ మూర్తి(ఏడీ), సుధీర్‌బాబు, మల్లిబాబు, స్వర్ణలత పాల్గొన్నారు.

## ముస్తాబాదలో 2,300 ఎకరాల్లో వరి పంట నష్టం



గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదలో వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా మేరకు 2,300 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.లక్ష్మీ తేజస్వి చెప్పారు. ముస్తాబాదలో వరదల కారణంగా దెబ్బతిన్న పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. పంట నష్ట పరిహార ప్రక్రియ ముగిసిందని చెప్పారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీపై వరి, మినుము, పెసర విత్తనాలను సబ్సిడీపై అందజేస్తుందన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ముస్తాబాద రైతులు పాలడుగు మల్లిఖార్జునరావు, రత్నారావు, గరిమెళ్ల పూర్ణ, కడియాల రాజా తదితరులు పాల్గొన్నారు.

## మెకానిక్ షెడ్డులకు పోటెత్తుతున్న బైక్‌లు

పాయకాపురం(విజయవాడరూరల్): రోజుల తరబడి వరద ముంపునకు గురైన ద్విచక్రవాహనాలు మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్లకు భారీగా వస్తున్నాయి. వరద నుంచి బయటపడిన ప్రాంతాల్లోని ప్రజలు తమ వాహనాలను మెకానిక్‌ల వద్దకు తీసుకొస్తున్నారు. ఈ వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం ప్రకటించకపోవడంతో ప్రజలే అప్పు చేసి మరీ మరమ్మతులు చేయిస్తున్నారు. తినడానికి తిండి ఉన్నా లేకున్నా పనులకు వెళ్లాలంటే ద్విచక్రవాహనం అవసరం తప్పదని చిరుద్యోగులు పేర్కొంటున్నారు. పాయకాపురం, కండ్రిక ప్రాంతాల్లోని మెకానిక్ షెడ్లన్నీ బైక్‌లతో నిండిపోయాయి.

## వరదలతో అన్నదాతకు అపార నష్టం


ఆరుగొలనులో వరదతో దెబ్బతిన్న వరి పంట

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి ఉధృతంగా తరలివస్తున్న వరద నీటితో పంట పొలాలు జలమయమయ్యాయి. బాపులపాడు మండలంలోని బొమ్ములూరు, కానుమోలు, రంగయ్య అప్పారావు పేట, ఆరుగొలను, ఓగిరాల, రామన్నగూడెం, కానుమోలు, కాకులపాడు, దంటగుంట్ల గ్రామాల్లో వరి పంట పొలాలు 10 రోజులుగా పూర్తిగా నీట మునిగి జలాశయాలను తలపించాయి. బుడమేరు ఉధృతంగా ప్రవహించటంతో బాపులపాడు మండలంలో దాదాపు 15 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగి నష్టం జరగ్గా, మరో 1,200 ఎకరాల్లో మినుము పంటకు నష్టం వాటిల్లింది. 10 రోజుల పాటు నీట మునిగిన వరి పొలాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ఆయా గ్రామాల్లో పొలాల్లో నిల్చిపోయిన వరద నీరు బయటకు తీస్తున్న రైతులు లబోదిబోమంటున్నారు. వరి పొలాల్లో ఎకరాకు సగటున రూ.12 వేలు వరకు ఇప్పటికే పెట్టుబడి వ్యయం అయిందని రైతులు వాపోతున్నారు.

**సస్యరక్షణ చర్యలు పాటించాలి..**

పిలక దశలో వరి పంట నీట మునిగితే 5-10 రోజుల వరకు తట్టుకునే సామర్థ్యం ఉంటుంది. నీరు బయటకు పోయిన తర్వాత ఎకరాలకు 20 కిలోల యూరియా, మరో 20 కిలోల పోటాష్ అదనంగా చల్లాలి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరి పంటకు ఎండు ఆకు తెలుగు, మాగుడు తెగులు, ఆకు ముడత తెగులు సోకే ప్రమాదం ఉండటంతో రైతులు ముందస్తుగా సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– జి.భవాని, మండల వ్యవసాయాధికారి

## కొనసాగుతున్న చవితి వేడుకలు


పోరంకిలో సామూహిక వ్రతం చేస్తున్న భక్తులు


పెద ఓగిరాలలో ఊరేగింపు నిర్వహిస్తున్న నిర్వాహకులు

పెనమలూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పోరంకిలో గంగానమ్మ గుడి వద్ద భక్తులు బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని బుధవారం నిర్వహించారు. శివసతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 50 మంది దంపతులు వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భవిష్యత్‌లో మరిన్ని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ట్రస్టు సభ్యులు తెలిపారు.

**ఉయ్యూరులో నిమజ్జనాలు..**

ఉయ్యూరు: జై గణేశా...జైజై గణేశా..జై బోలో గణేష్ మహరాజ్ అంటూ భక్తులు గణనాథుడికి విశేష పూజలు జరిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో ఐదో రోజైన బుధవారం గణేష్ నవరాత్రుల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉయ్యూరు మండలంతో పాటుగా పట్టణంలోని పలు చోట్ల గణేష్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో గణనాథుడిని పురవీధుల్లో ఊరేగించి పుల్లేరు, రైవస్ కాలువల్లో నిమజ్జనం చేశారు.

**భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రులు**

కంకిపాడు: గణేష్ నవరాత్రులను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో ఐదో రోజైన బుధవారం చలువ పందిళ్లల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈడుపుగల్లు శివాలయంలో భక్తులకు నిర్వాహక ప్రతినిధులు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎంపీపీ దేవినేని రాజా పాల్గొని, అన్నసంతర్పణను ప్రారంభించారు. కంకిపాడు, కోలవెన్ను గ్రామాల్లోని చలువ పందిళ్లను కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) సందర్శించి స్వామి వారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో కొప్పరాజు సురేష్, నిర్వాహకులు పాల్గొన్నారు.


గన్నవరంలో గణేషుని ఊరేగింపు

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక రాయ్‌నగర్ ఎంపీపీ స్కూల్ వద్ద జరుగుతున్న గణపతి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గన్నవరంలోని పలు ప్రాంతాలతో పాటు దావాజిగూడెం, కేసరపల్లి గ్రామాల్లో గణపతి నిమజ్జన వేడుకలు జరిగాయి.

## ఏలూరు కాలువకు గండి పూడ్చరూ!

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువకు గండి పడి 10 రోజులు గడుస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీగా పడిన గండి ద్వారా కాలువ నీరు పంట పొలాలను ముంచెత్తుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. పది రోజులుగా వరిపైరు ముంపులోనే ఉండడం వల్ల కుళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీన బుడమేరు కాలువ పొంగి ఏలూరు కాలువలో కలవడం వల్ల ఉధృతంగా ప్రవహించింది. దీంతో కేసరపల్లిలోని ఎస్సీ కాలనీ, అప్పారావుపేట వద్ద కాలువకు గండ్లు పడే ప్రమాదం ఉండడంతో ముందస్తు జాగ్రత్తగా కాలువకు అవతలి వైపున జగనన్న కాలనీ దగ్గరలో పంట పొలాల వైపు గండి పెట్టారు. దీంతో నీటి ప్రవాహానికి గండి పెద్దది కావడంతో కాలువలోని నీరు పంట పొలాలను ముంచెత్తింది. కాలువలో నీటి ప్రవహం కొంతమేర తగ్గినప్పటికీ గండిని మాత్రం పూడ్చకుండా వదిలివేశారు. దీంతో అప్పటి నుండి వరి పొలాలు ముంపులోనే చిక్కుకుని ఉన్నాయి. కాలువ గండిని పూడ్చి పంట పొలాలను కాపాడాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ పట్టించుకున్నా దాఖలాలు లేవని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖాధికారులు ఇంత వరకు గండి పడిన కాలువ ప్రాంతం వైపు కన్నెత్తి కూడా చూడలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన కాలువ గండి పూడ్చాలని అన్నదాతలు కోరుతున్నారు.

# తేరుకుంటున్న వరద ముంపు గ్రామాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బుడమేరు వరదతో బాపులపాడు మండలంలో 10 రోజులుగా జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. మండలంలోని రామన్నగూడెం, ఆరుగొలను, రంగయ్య అప్పారావు పేట, ఓగిరాల, వైకుంఠ లక్ష్మీపురం గ్రామాలు నీట మునగటంతో ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో ఉంటున్న ప్రజలు క్రమంగా తిరిగి ఇంటిబాట పడుతున్నారు. ఆయా గ్రామాల్లోని ఇళ్లు, ఇళ్లలోని వస్తువులు వరద నీటి ముంపులో నానుతున్నాయి. దీంతో గ్రామస్తులు ఇళ్లకు చేరుకుని తమ వస్తువులను, ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు. బాపులపాడు, కానుమోలు, ఆరుగొలను, ఓగిరాల, రామన్నగూడెం, రంగయ్య అప్పారావు పేటలో ఎనిమిది పునరావాస కేంద్రాల్లో దాదాపు 1,800 మంది నిర్వాసితులు ఆశ్రయం పొందుతున్నారు. దాతల సహాయంతో నిర్వాసితులకు అధికారులు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. కానుమోలు జెడ్పీ హైస్కూల్‌లో ఆశ్రయం పొందుతున్న నిర్వాసితులకు దంటగుంట్ల మాజీ సర్పంచ్ యజ్ఞవరపు గణపతి ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు.

**పునరావాస కేంద్రంలో క్యాన్సర్ రోగి**

బాపులపాడు మండలం ఓగిరాలకు చెందిన కగ్గా నాగేశ్వరరావు గతేడాదిగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. బుడమేరుకు వరద ఉధృతితో గ్రామం ముంపునకు గురికావటంతో కుటుంబ సభ్యులతో కలిసి నాగేశ్వరరావును కానుమోలులోని పునరావాస కేంద్రానికి తరలించారు. గత వారం రోజులుగా ఇక్కడే ఆశ్రయం పొందుతూ చికిత్స పొందుతున్నాడు. కనీసం ఆహారం కూడా తీసుకోలేని స్థితి కావటంతో అన్నవాహికకు అమర్చిన పైపు ద్వారా కుటుంబ సభ్యులు రెండు పూట్ల ఆహారం ఇస్తున్నారు.

**బయటపడుతున్న పొలాలు**

గన్నవరం: బుడమేరు కాలువ వరద ఉధృతి తగ్గుముఖం పడుతుండడంతో పంట పొలాలు ముంపు నుంచి కోలుకుంటున్నాయి. మండలంలోని కేసరపల్లి పరిధిలో బుడమేరుతో పాటు చీమలవాగు పొంగి పొర్లడంతో వందలాది ఎకరాలు ముంపు బారినపడ్డాయి. దీంతో గత 10 రోజులుగా నీట మునిగిన పంట పొలాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. పొలాల్లో నీటిని బయటకు తరలించి వరి పైరును కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రోజుల తరబడి వరిపైరు నీటిలో మునిగి కుళ్లిపోవడంతో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. బుద్ధవరం, అజ్జంపూడి, బూతిమిల్లిపాడు, దావాజిగూడెం, అల్లాపురం గ్రామాల పరిధిలో భారీవర్షాలు, వరద ముంపు వల్ల ఎక్కువ శాతం వరి పంట దెబ్బతింది. ప్రభుత్వం త్వరితగతిన పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


కేసరపల్లి పరిధిలోని వరి పొలంలో తగ్గిన వరద నీరు


కానుమోలు జెడ్పీ హైస్కూల్‌లో భోజనం వడ్డిస్తున్న దాతలు